బాలికల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

● కలెక్టర్ హరిచందన



మాట్లాడుతున్న కలెక్టర్ హరిచందన దాసరి

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బాలికల్లో సృజనాత్మకతను పెంపొందించడంతో పాటు వారిలో మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. నగరంలోని నింబోలి అడ్డా ప్రభుత్వ బాలికల వసతి గృహం(జువెనైల్ జస్టిస్ శాఖ)లో ఏర్పాటు చేసిన నావార్థ కార్యక్రమాన్ని గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న వస్తువులను సృజనాత్మకతో కొత్తగా తయారుచేసే విధంగా బాలికలకు ప్రత్యేక శిక్షణ అందించాలన్నారు. సమాజంలో విద్య విలువైన ఆయుధమని, చదువుతోపాటు ఎంచుకున్న అంశంలో శ్రద్ధగా కష్టపడి పని చేయాలని సూచించారు. కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కోర్సులతో పాటు 'నావార్థ' కార్యక్రమం కూడా బాలికలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బాలికలకు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని, హాస్టల్ గదులతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ సూపరింటెండెంట్ మైథిలి, వయోవృద్ధులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, జాయింట్ డైరెక్టర్ ఎఫ్ఎం మంజుల, వైద్యురాలు డాక్టర్ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా శివకుమార్



నల్లకుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగిస్తున్న హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్‌కు తెలంగాణ రాష్ట్రానికి చెందిన తుప్పటి శివకుమార్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం హెడ్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ మాధవ్ ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మానవ హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో సంస్థ సభ్యుడిగా నియమించినందుకు కౌన్సిల్ చైర్మన్ మాధవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి సతీష్ దేవరకొండలకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రైనేజీ సమస్యకు పరిష్కారం


డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కవాడిగూడ డివిజన్‌లోని చిత్రాల నర్సింహులు ప్రభుత్వ పాఠశాల వద్ద నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించినట్లు కార్పొరేటర్ జి.రచనశ్రీ తెలిపారు. గురువారం కవాడిగూడ చిత్రాలనర్సింహులు ప్రభుత్వ పాఠశాల, పరిసర ప్రాంతాలను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల వద్ద నిత్యం డ్రైనేజీ పొంగిపొర్లడంతో ప్రధానోపాధ్యాయురాలు మీనాకుమారి ఫిర్యాదు మేరకు జలమండలి అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించి సమస్యను పరిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు జి.వెంకటేష్, నగర నాయకులు మహేందర్‌బాబు, డివిజన్ అధ్యక్షుడు సలంద్రి వివేక్‌యాదవ్, ఓబీసీ మోర్చా డివిజన్ అధ్యక్షుడు ఎ.ప్రభాకర్ గంగపుత్ర, నాయకుడు శివరాజ్, వాటర్ వర్క్స్ మేనేజర్ శ్రీధర్, ఉన్నతపాఠశాల ప్రిన్సిపాల్ మీనాకుమారి పాల్గొన్నారు.

కచ్చానాలాల్లో వ్యర్థాలను తొలగించాలి


మట్టితొలగింపు పనులను పరిశీలిస్తున్న గోరక్‌నాథ్

ముషీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కచ్చానాలాల వల్ల నిత్యం సమస్యలు ఉత్పన్నమవుతాయని వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు పూస గోరక్‌నాథ్ పేర్కొన్నారు. గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఫ్రెండ్స్‌కాలనీ, వినోభానగర్, గంగపుత్రకాలనీ, మోహన్‌నగర్‌లో కచ్చానాలా మట్టి తొలగింపు పనులను జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టారు. ఈ పనులను జీహెచ్ఎంసీ ఏఈ మురళీతో కలిసి గోరక్‌నాథ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంబాబు, చక్రీ, ఆరీఫ్, దినకర్ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి బస్తీబాట : సీఈ


విద్యుత్ తీగలను పరిశీలిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు, ఎస్ఈ వెంకన్న

ముషీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా విద్యుత్‌శాఖ అధికారులు బస్తీబాట కార్యక్రమం చేపట్టారని సీఈ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. గురువారం బస్తీబాట కార్యక్రమంలో భాగంగా అంజయ్యబస్తీ, గుల్షాన్‌నగర్ తదితర ప్రాంతాల్లో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ప్రతి మంగళ, గురు, శనివారాల్లో బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పోల్ టూ పోల్ సర్వేచేసి సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరిస్తున్నాం అన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఈ వెంకన్న, డీఈ నెహ్రూనాయక్, ఏడీఈ సంపత్, ఏఈ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పటాన్‌బస్తీలో డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి


జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాగభూషణంగౌడ్, మురళీమోజేస్

ముషీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ముషీరాబాద్ పటాన్‌బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గ బి-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ జలమండలి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పటాన్‌బస్తీ నుంచి దయారామార్కెట్ చౌరస్తా వరకు చేపట్టిన డ్రైనేజీ పనులను వేగవంతం చేయాలన్నారు. రూ.22.75లక్షలతో చేపట్టిన పనులను పూర్తిచేసి స్థానిక ప్రజలకు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి అన్నారు. స్పందించిన జీఎం శ్రీధర్‌రెడ్డి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీమోజేస్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ మినాజ్, నాయకులు హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నారెడ్డినగర్‌లో చెత్త తొలగింపు చేస్తున్న సిద్దార్థ ముదిరాజ్ తదితరులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

అంబర్‌పేట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ అన్నారు. డివిజన్‌లోని చెన్నారెడ్డినగర్‌లో కొద్ది రోజులుగా రోడ్లపై చెత్త పేరుకుపోవడంతో స్థానికులు సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన గురువారం పారిశుధ్య కార్మికులను పిలిపించి వెంటనే చెత్తను అక్కడి నుంచి తొలగింపచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతున్న పరిసరాలలో చెత్త పేరుకుపోతే అధికారులు ఎప్పటికప్పుడు తొలగింపజేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంజయ్, సురేష్ బొట్టు, మహేష్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తిచేయాలి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, నవంబర్ 13(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలో జలమండలి ఆధ్వర్యంలో చేపడుతున్న అన్ని పెండింగ్ పనులపై అధికారులు దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో అధికారులు ఏ మాత్రంగా నిర్లక్ష్యంగా వ్యవహరించినా సహించేది లేదని, కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. గురువారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో ఎమ్మెల్యే వెంకటేష్ సమావేశం నిర్వహించి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుతెన్నులపై, పెండింగ్ పనుల విషయంలో జరుగుతున్న జాప్యం, నిర్లక్ష్యంపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కలుషిత నీటి సమస్య పరిష్కారానికై, డ్రైనేజీల్లో పేరుకపోయిన వ్యర్థాలను, మట్టికుప్పలను తొలగించేందుకు తక్షణంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జలమండలి జనరల్ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ జనరల్ మేనేజర్లు కృష్ణ, విష్ణువర్ధన్, ఏఈలు మాజీద్, ప్రదీప్, వెంకటేష్, రోహిత్ పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం


సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వెంకటేష్, జలమండలి అధికారులు

నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని తన నివాసంలో గురువారం జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే సమీక్షిస్తూ పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతుందని అధికారులను అడిగి తెలుసుకుని ఎలాంటి జాప్యానికి ఆస్కారం లేకుండా పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఈఈ ఆశాలత, డీఈఈలు ప్రశాంతి, ప్రవీణ్, ఏఈలు సబిత, ప్రశాంత్, పృథ్వీ, శ్రీగంధ్‌పవన్, అధికారులు పాల్గొన్నారు.

'ప్రాణధార' ఆవిష్కరణ


ప్రాణధార పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాములు, చిదంబరం, రఘుశ్రీ

చిక్కడపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): స్ఫూర్తిని నింపే ఆశావహ రచనలే రచయితకు ప్రాణధారగా నిలుస్తాయని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షుడు డాక్టర్ పిల్లలమర్రి రాములు అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ కవి, రచయిత అంబల్ల జనార్దన్ రచించిన ప్రాణధార కథానిక సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ప్రముఖ రచయిత కూర చిదంబరం అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కార్యక్రమంలో పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించిన పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ అనేకమందికి తెలంగాణాలోని వలస జీవనం అనేక అనుభవాలను నేర్పిందన్నారు. అంబల్ల జనార్దన్ బొంబాయిలో పుట్టినా తన పూర్వీకుల జీవితాలను చూసి కృంగిపోలేదన్నారు. పలువురు ఆత్మవిశ్వాసంతో కష్టాలను జయించి తమతమ వృత్తుల్లో రాణించిన సందర్భం మరిచిపోలేనిదన్నారు. అలాంటివారిలో అంబల్ల జనార్దన్ ఒకరని ఆయన సాహితీ యోధుడిగా మారి రచనలు చేయడం విశేషమన్నారు. కూర చిదంబరం మాట్లాడుతూ 75సంవత్సరాల వయసులోనూ చురుకుగా, నిబద్ధతతో స్ఫూర్తివంతమైన రచనలను అందించిన గొప్ప దార్శనికుడు జనార్దన్ అని అభినందించారు. అనేక భాషల్లో ఆయన రచనలు అనువదింపబడడం, మహారాష్ట్ర పాఠ్యపుస్తకాల్లో ఆయన రచనలు చోటుచేసుకోవడం తెలంగాణాకే గర్వకారణమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ప్రముఖ ఆశుకవి డా.రాధశ్రీ, బండారుపల్లి రామచందర్‌రావు, డా. లలితవాణి, మానస ఆర్ట్ థియేటర్స్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి రఘుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దళితులను విభజించి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్ర

● మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ నేతలు


మహాసభ కరపత్రాలను అందజేస్తున్న మాలమహానాడు నేతలు కొక్కు అనిల్‌కుమార్, మరిపల్లి శ్రీకాంత్, జైకుమార

నల్లకుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : దేశంలోని మనువాద పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాల్లో భాగంగా దళితులను విభజించి మన ఐక్యతను చీల్చి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రనే ఎస్సీ వర్గీకరణ అని మాల మహానాడు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శులు మరిపల్లి శ్రీకాంత్, జైకుమార, కొక్కు అనిల్‌కుమార్, మన్నె రాజేష్, జెట్టి గిరి ఆరోపించారు. ఈ వర్గీకరణను దళితులు స్థాపించిన పార్టీలు వ్యతిరేకిస్తున్నాయని వారన్నారు. ఈ నేపథ్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం రాజీలేని పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. గురువారం నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్ బస్తీలో ఈనెల 23న సరూర్‌నగర్ స్టేడియంలో జరుగనున్న మాలల రణభేరీ మహాసభను విజయవంతం చేయాలని మాల మహానాడు నేతలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి మాలలను కలిసి మాలల రణభేరీ మహాసభ కరపత్రాలను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనల మేరకు 2011 జనాభా లెక్కలతో సరైన ఎంపరికల్ డేటా పరిగణలోకి తీసుకోకుండా కులాల వారీగా చేసిన ఎస్సీ వర్గీకరణను పాలకులు వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రోస్టర్ పాయింట్ల కేటాయింపును పున:సమీక్షించిన జీవో 99ను సవరించి మాలలతో పాటు గ్రూప్ 3లో ఉన్న మరో 25 కులాలకు న్యాయం చేయాలన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎస్సీల రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. మాలల రణభేరీ మహాసభకు మాల, మాల ఉపకులాలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

నేడు డయాబెటిక్ క్యాంప్

చిక్కడపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా చిక్కడపల్లిలో శుక్రవారం ఉచితంగా డయాబెటిక్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ డయాబెటిస్ విభాగం చైర్మన్ డా. జీకే రమణ తెలిపారు. శ్రీసాయి డయాగ్నస్టిక్ కేంద్రంలో ఉదయం 8గంటల నుంచి రాత్రి 8గంటల వరకు శిబిరం కొనసాగుతుందని పరీక్షలు చేసి రిపోర్టులు అందజేస్తారని వివరించారు.


అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ గురువారం డివిజన్‌లోని ప్రేమ్‌నగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ప్రేమ్‌నగర్‌లో మెయిన్ రోడ్డుపై కూరుకుపోయిన మ్యాన్‌హోల్ గురించి స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన జలమండలి సిబ్బందిని పిలిపించి కూరుకుపోయిన మ్యాన్‌హోల్ స్థానంలో నూతన మ్యాన్‌హోల్‌ను ఏర్పాటు చేయించారు. - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

భాషకు పట్టం కట్టాలని నినదించిన కాళోజీ

● తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు


కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రమణారావు తదితరులు

నల్లకుంట, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : నాడు పలుకుబడుల భాషకు పట్టం కట్టాలని నినదించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. గురువారం నల్లకుంటలోని తెలంగాణ బ్రాహ్మణ సంఘం సమైక్య కార్యాలయంలో ప్రజాకవి, తెలంగాణ ఉద్యమకారుడు, పద్మభూషణ్ కాళోజీ నారాయణరావు వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో ప్రజాచైతన్యం తీసుకువచ్చిన మహాకవి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిదే అని నినదించిన స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ అని కొనియాడారు. నాడు తెలంగాణ కోసం పరితపించిన మహోన్నత వ్యక్తి కాళోజీ అని శ్లాఘించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమైక్య సంఘం ఉపాధ్యక్షుడు దేవులపల్లి రంగారావు, ప్రచార కార్యదర్శి గూడ జయరాం, సంయుక్త కార్యదర్శి మల్యాల వెంకటేశ్వరరావు, రాజ్, సత్యప్రకాష్‌రావు, న్యాయవాది శ్రీహరి, యాదగిరి పాల్గొన్నారు.

నేడు జింఖానా గ్రౌండ్‌లో ఖోఖో జూనియర్ జట్టు ఎంపిక

బర్కత్‌పుర, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ జిల్లా జూనియర్స్ ఖోఖో జట్టుల ఎంపిక ఈనెల 14న జింఖానా గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పోచప్ప, ఉపాధ్యక్షుడు కిషోర్ కుమార్ తెలిపారు.

శుక్రవారం మధ్యాహ్నం 3.30గంటలకు ఈ ఖోఖో సెలక్షన్స్ బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలు జరుగుతాయని, ఈ పోటీల్లో పాల్గొనే జట్లను ఎంపిక చేస్తున్నట్లు వారు తెలిపారు. 18సంవత్సరాలు నిండి ఉండాలని, సెలక్షన్‌కు హాజరయ్యే విద్యార్థులు ఆధార్ కార్డు జిరాక్స్, జనన ధ్రువీకరణ పత్రం, స్టడీ సర్టిఫికెట్ తీసుకురావాలని వారు సూచించారు.

కల్పనాయాదవ్‌కు న్యాయం జరిగేలా కృషి చేస్తాం

● టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్



కల్పనాయాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్, అంజన్‌కుమార్‌యాదవ్

రాంనగర్ : కాంగ్రెస్ పార్టీ పటిష్టత కోసం అంకితభావంతో నిస్వార్థంగా పనిచేస్తున్న మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్‌కు పార్టీపరంగా తగిన న్యాయం జరిగేలా కృషిచేస్తామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. కల్పనాయాదవ్ జన్మదినం సందర్భంగా ఆమెకు అంజన్‌కుమార్‌యాదవ్ శాలువాకప్పి సత్కరించారు. అదేవిధంగా అనిల్‌కుమార్‌యాదవ్ కల్పనాయాదవ్‌కు స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంనగర్ కార్పొరేటర్‌గా రెండు పర్యాయాలు పనిచేసిన ఆమె డివిజన్ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఆమె పార్టీని నమ్ముకుని ఉంటూ పార్టీ కార్యకర్తలను కాపాడారని అన్నారు. ఆమెకు రాబోయే రోజుల్లో ప్రభుత్వం, పార్టీపరంగా తగు పదవులు లభించేలా కృషి చేస్తామన్నారు.

బస్టాపుల్లో ఆటోలు ఆపితే కఠిన చర్యలు

● ముషీరాబాద్ డిపో మేనేజర్ టి.రఘు



రాంనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాపుల్లో ఆటోలను ఆపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ముషీరాబాద్ డిపో మేనేజర్ టి.రఘు హెచ్చరించారు. ముషీరాబాద్ బస్‌డిపో పరిధిలోని పలు బస్టాపుల్లో ఆటోడ్రైవర్లు ఆటోలను నిలుపుతున్నారని, దీంతో బస్సులు ఆగేందుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో బస్టాపుల్లో ఆటోలు ఆపే వారిపై చర్యలు తీసుకోవాలని చిక్కడపల్లితోపాటు పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశామన్నారు. గాంధీ ఆస్పత్రి బస్టాప్ వద్ద చాలా మంది ఆటోలను నిలుపుతున్నారని, దీంతో ఆర్టీసీ ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

చెత్త వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు


చెత్త వేయకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన దృశ్యం

చిక్కడపల్లి : చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని ఎంఎస్ రామారావు వీధిలో చెత్తాచెదారాలు, కుళ్లిన వస్తువులు వేయకుండా ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న కళాదీక్షితులు కళావేదిక ఎంట్రెన్స్ ప్రాంతంలో చెత్తాచెదారాలు, కుళ్లిన కోడి, మాంసం ముక్కలు గుర్తుతెలియని వ్యక్తులు వేస్తుండడంతో ఈ హాల్‌ను ఆనుకుని ఉన్న ఎంఎస్ రామారావు వీధిప్రాంతంలో ఇనుప ఫెన్సింగ్‌ను గానసభ అధ్యక్షుడు జనార్దనమూర్తి ఏర్పాటు చేయించారు. ఈ పదార్థాల నుంచి వస్తున్న దుర్వాసనతో హాలులోకి ప్రవేశించే సమయంలో కళాకారులు, ప్రేక్షకులు ఇబ్బందులు పడుతుండడంతో ఈ ఏర్పాటు చేసినట్లు మూర్తి వివరించారు.

కవితా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్వసాహితి కళావేదిక ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు కొల్లి రమావతి, మహిళావిభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పివిపి అంజనికుమారి తెలిపారు. బాల్యమా నీవెక్కడా అంశంపై ఈ పోటీ జరుగుతుందన్నారు. టాప్ 20మంది విజేతల్లో ప్రథమ విజేతకు వెయ్యి రూపాయలు, ద్వితీయ విజేతకు ఐదువందల రూపాయల నగదు బహుమతి ఉంటుందన్నారు. వచనం, పద్యం ఏదైనా రాయవచ్చునని పోటీల్లో పాల్గొనే ఆసక్తి గల వారు ఇతర వివరాలకు 99080 66242 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్లపైన భవన నిర్మాణ సామగ్రి

చిక్కడపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇళ్లు, భవనాల నిర్మాణం సందర్భంగా నిర్మాణ సామగ్రి, వ్యర్థాలు రోడ్లపైన వేయడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. డివిజన్‌లోని వివేక్‌నగర్, చిక్కడపల్లి, అశోక్‌నగర్, గాంధీనగర్, జవహర్‌నగర్ ప్రాంతాల్లో ఇంటి నిర్మాణాల క్రమంలో నిర్మాణ సామగ్రి, వ్యర్థాలను రోడ్లపై ఉంచుతున్నారు. అశోక్‌నగర్ పార్కు-1 పక్కన నిర్మాణమవుతున్న భవనానికి సంబంధించిన నిర్మాణ సామగ్రిని పార్కు ప్రహరీ చుట్టూ ఉంచారు. దీంతో పార్కుకు వచ్చే సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై ఇంటినిర్మాణ సామగ్రి వేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.

నిబంధనల ప్రకారమే

సుందరయ్యపార్కు వాకర్స్‌క్లబ్ ఎన్నికలు

● వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి


మాట్లాడుతున్న సుందరయ్యపార్కు వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పి.నిరంజన్‌రెడ్డి

రాంనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఇంటర్నేషనల్ నిబంధనల ప్రకారమే సుందరయ్యపార్కు వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్‌కు ఈనెల 23న ఎన్నికలు నిర్వహిస్తున్నామని సెంట్రల్ అధ్యక్షుడు పి.నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం సుందరయ్యపార్కులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కమిటీ పదవి కాలం డిసెంబర్ 31తో ముగియనున్న నేపథ్యంలో క్లబ్ నిబంధనల ప్రకారం రెండు నెలల ముందే ఎన్నికలు నిర్వహించాలనే నిబంధన ఉందన్నారు. ఆ ప్రకారమే తాము ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. అయితే క్లబ్ మాజీ అధ్యక్షుడు, కొంతమంది సభ్యులు పార్కుపై ఆధిపత్యం కోసం ప్రజాస్వామ్య పద్ధతిని ఖూనీ చేయడం కోసమే ఎన్నికల నిర్వహణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం కొనసాగుతున్న కమిటీ పార్కు అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు తాము కృషి చేస్తుంటే జీర్ణించుకోలేకనే కొంతమంది తమపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధిని చూసి తమ కమిటీకి లభిస్తున్న ఆదరణను తట్టుకోలేక తమను అప్రదిష్టపాలు చేయడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. పార్కులో ఆ వర్గం వారు రాజకీయాలు చేస్తూ పార్కు వాతావరణాన్ని చెడుగొడుతూ తమపైనే ఆరోపణలు చేయడం శోచనీయమన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వాకర్స్ ప్రశాంతతను వారు చెడగొడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహిస్తున్న ఈ ఎన్నికల్లో పోటీచేసి గెలవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎస్.మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కల్యాణ్‌నాయక్, మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, అంబాటి శ్రీనివాస్‌రెడ్డి, శైలజమోహన్, సీనియర్ సభ్యులు మహ్మద్ రఫీఖాన్, కల్లూరి రమేష్, వీరభద్రారెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిక్కడపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగుల సమస్యలు, ఆరోగ్య మిత్రాల జీతభత్యాల సమస్యలు, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల నాన్‌టీచింగ్ సిబ్బందికి పీఆర్సీ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఉద్యోగ సంఘం నేతలు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. సంఘం గౌరవాధ్యక్షుడు భూపాల్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో సలహాదారును కలిసి వినతిచేయగా సీఎం దృష్టికి సమస్యలు తీసుకువెళ్తానని హామీనిచ్చారన్నారు.

16న బ్రాహ్మణ ప్రజాప్రతినిధుల రౌండ్‌టేబుల్ సమావేశం

రాంనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు బ్రాహ్మణ ప్రజాప్రతినిధుల రాజకీయ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషినల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజమూరి సుధాకర్ తెలిపారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ శ్రీనివాసనగర్‌కాలనీలోని రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశాన్ని, రాష్ట్రాన్ని బ్రాహ్మణ ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించి నాయకత్వం నిర్వహించాలన్నారు. నేడు యువకులను ప్రోత్సహించేందుకు రాష్ట్రస్థాయి బ్రాహ్మణ రాజకీయ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, బ్రాహ్మణ సంఘాల నేతలు పాల్గొంటారని తెలిపారు. బ్రాహ్మణ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు అబిడ్స్‌లోని రాఘవ రత్నా టవర్స్‌లోని ఇండియా మైనింగ్ ఇంజనీరింగ్ అసోసియేషన్ కార్యాలయంలో ఈ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.